www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 31 | జూలై | 2026
పేజీలు : 8

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి



- 28.5 అడుగులకు చేరిన వరద నీరు
- తాలిపేరు నీరు దిగువకు విడుదల

2 లో

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



-గత బీఆర్ఎస్ పాలనలో అప్పులు భారం
-కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉంది
-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండ్రుగొండ:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. చంద్రుగొండ మండల పరిధిలోని తొలుత మంగయ్య బంజర్, పోకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణతో కలిసి సుమారు రూ 1.15కోట్ల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. తొలుత మంగయ్య బంజర్‌లో సర్పంచ్ మాలోత్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం

మిగతా 2లో..



# నాసిరకం పనులను ఉపేక్షించేది లేదు..



- పనులపై అధికారులు పర్యవేక్షించాలి
- రూ 28.78 లక్షల అభివృద్ధి పనుల శంకుస్థాపన
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం, సుజాతనగర్‌లతో పాటు పాల్వంచ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచలోని రెండవ డివిజన్‌లో ఎంజిఎఫ్ నిధులతో చేపట్టిన రూ. 11. 96 లక్షల సిసి రోడ్, ఐదవ డివిజన్‌లో రూ. 10.96/లతో సిసి రోడ్, రూ. 6.21 లక్షలతో డ్రైన్‌ల నిర్మాణానికి మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక కార్పోరేటర్‌లు వేగినాటీ భవిత, నూకల సరితలతో కలిసి గురువారం శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ పాల్వంచ ప్రాంత ప్రజలు నాపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని అన్నారు. ఇందుకు కావలసిన నిధులను సమకూర్చుకొనేందుకు ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిధులను మంజూరు చేయిస్తున్నానని చెప్పారు. ఇప్పటికే దేశంలో ప్రతిష్టాత్మకమైన ఎర్త్ యూనివర్శిటీ నెలకొల్పామని, అలాగే కేంద్రీయ విశ్వ విద్యాలయం, యంగ్ ఇండియా స్కూల్, పోలీస్ సూపరిండెంట్ (ఎస్‌పి) కార్యాలయం , ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో 50 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ క్రీడా మైదానాన్ని నిర్మించబోతున్న తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న

మిగతా 2లో..

# పెరుగుతున్న ఆర్థిక అంతరాలు





-కమ్యూనిస్టుల బలోపేతమే దేశానికి రక్ష
-సిపిఐ శిక్షణ తరగతుల్లో బాగం

**ప్రజాపక్షం/బోనకల్ :** మోడీ పాలన తీరుతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, ఈ పరిణామం దేశ భవిష్యత్‌పై తీవ్ర పరిణామం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పోరేట్ శక్తులు, దేశ సంపదను తమ గుప్పిట పడుతున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ మధిర, బోనకల్, చింతకాని మండలాల శిక్షణా తరగతులు గురువారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణమండపంలో గురువారం జరిగాయి. ముందుగా ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు. బత్తినేని నీరజ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చేనాడు వందల కోట్లకు పరిమితమైన వారు, దశబ్దకాలంలో వేల, లక్షల కోట్లకు పడగలేత్తారన్నారు. ఆదానీ రూ.800 కోట్లకు పడగలెత్తారని, మోడీ నిర్ణయాలు చాలా వరకు , ఆదానీ కన్నుసన్నల్లోనే తీసుకుంటారని

మిగతా 2లో..

# ఆఖరి బిల్లు అందేదెన్నడో..?



-గృహ ప్రవేశాలు పూర్తయినా అందని ఆఖరి బిల్లు
-అప్పులు చేసి ఇండ్లు పూర్తి చేసిన నిరుపేదలు
-అధికారుల చుట్టూ ప్రతి రోజు ప్రదక్షిణ చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.జూలూరుపాడు మండలంలో యంత్రాంగం కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసే దిశగా క్షేత్రస్థాయిలో ప్రోత్సహిస్తున్నారు. కానీ ఇందిరమ్మ ఇళ్ల బిల్లులకు లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అప్పులు చేసి ముందస్తుగా డబ్బులు చెల్లిస్తూ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా చివరి దశ బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం ఐదు లక్షలు చెల్లిస్తున్నా మరో ఐదు లక్షల వరకు లబ్ధిదారులు సమకూర్చుకొని సొంతింటి ఆశలను నెరవేర్చుకుంటున్నారు. ఆర్థిక భారమైన ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తిచేసుకొని గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులకు చివరి దశ బిల్లు రాకపోవడంతో జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో బేస్మెంట్ రూప్ స్లాబ్ లెవెల్ వరకు మూడు విడతల్లో నాలుగు లక్షల రూపాయలు అందిన చివరి విడత లక్ష రూపాయలు రావాల్సి ఉంది. అపోసపో్ప చేసి ఇళ్ల నిర్మాణా లు పూర్తి చేసిన లబ్ధిదారులు చివరి బిల్లు కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఇల్లులు నిర్మించి నెలలు గడుస్తున్న చివరి బిల్లు చెల్లిం పులో జాప్యం జరుగుతుందని వాపోతు న్నారు.

**ఆవేదనకు గురవుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు..**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సొంతింటి కల నిజమై, కొత్త ఇంట్లోకి

మిగతా 2లో..

# నాసిరకం పనులను ఉపేక్షించేది లేదు..

(మొదటిపేజీ తరువాయి) ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టణ ప్రజలకు విముక్తి కలిగించేందుకు బైపాస్ రహదారులను నిర్మాణం మంజూరు చేయించానని అన్నారు. ప్రజల సొమ్ముతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాసిరకం పనులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరిగేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు సైతం దృష్టి సారించాలని కోరారు. పట్టణ వాసులకు కావాల్సి అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకొంటానని హామీ ఇచ్చారు. గతంలో ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో హమాలీ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ సజీవంగా దర్శనమిస్తున్నాయని కాలనీ వాసులు గుర్తు చేశారు. అప్పుడు మీరే, ఇప్పుడు మీరే మాకాలనీని పట్టించుకొని పనులను చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కార్పోరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కనగాల అనంతరాములు నాయకులు గౌతమి క్రిష్ణ, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్‌బాబు, నరహరి నాగేశ్వరరావు, కమటం సురేష్, రామారావు, ఆలపాటి ప్రసాద్, లీలావతి, ఆదిలక్ష్మి, వేములపల్లి రాజశేఖర్, భూక్యా విజయ్, లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు, గోపాల్, అంబడిపుడి నరేందర్, షేక్ కరీం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి) పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలు, రైతులు, నిరుద్యోగులకు న్యాయం చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గుడిసెలేని రాష్ట్ర నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల పంపిణీ, 72వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరో 16వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ మార్గంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజ్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు రమణ, టౌన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, ఉప్పల ఏడుకొండలు, ఫజల్ బక్ష్, రాజుని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి నది ఉరకలేస్తోంది. గత నాలుగురోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నదిలోకి కొత్తనీరు వచ్చి చేర డంతో ప్రస్తుతం భద్రాచలం వద్ద 28.5 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. ప్రస్తుతం అతి నెమ్మదిగా పెరుగుతున్న



ప్పటికీ శుక్రవారం ఉదయం నుండి వేగంగా పెరిగే అవకాశం ఉన్నట్లు కేంద్ర జలవనరుల సంఘం అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పడుతున్న వర్షాలకు తెలంగాణలోని చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో తాలిపేరు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యానికి చేరుకోవడంతో 22 ప్రాజెక్టు గేట్లు ఎత్తి 90వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో గోదావరికి మరింత వరద తాకిడి పెరుగుతోంది. ఇంద్రావతి, ప్రాణహిత ఉపనదులు వర్షాల కారణంగా పెద్దఎత్తున ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తెలంగాణాల్లో భారీ వర్షా సూచన ఉండటంతో గోదావరినదికి మరింత వరద పెరగనుంది.

# పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

(మొదటిపేజీ తరువాయి)

హేమంతరావు ఆరోపించారు. ఇప్పుడు ఒక శాతం మంది ధనవంతుల చేతిలో 99 శాతం సంపద కేంద్రీకృతమైనదని అన్నారు. మోడీ పాలన ప్రజలను విస్మరించి సాగుతుందని, ప్రైవేట్ రంగం విరాజిల్లుతుందని హేమంతరావు తెలిపారు. ప్రధానమైన వ్యవసాయ రంగం, సంక్షోభంలో కూరుకుపోతుందని, నిరుద్యోగం పెరిగి పోతుందని, అల్పాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరగడం దేశంలో అశాంతికి కారణమవుతుందని అన్నారు. ఇదే సమయంలో మతోన్మాద శక్తులు ఈ దేశాన్ని భక్తి ముసుగులో విచ్చిన్నం దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోను ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, కాంగ్రెస్ కేవలం మాటలకే పరిమితమవుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా పార్టీ నిర్మాణ కర్తవ్యాలను నిర్వర్తించాలని అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సాసిద్ధులను చేయాలని అన్నారు. శాఖ నిర్మాణం పటిష్టంగా ఉండడంతో పాటు కార్యకర్తలను నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని హేమంతరావు సూచించారు. పార్టీ ప్రచారం ప్రజా ఆందోళనలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మాత్రమే సామాజిక, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని హేమంతరావు తెలిపారు.

**-మోడీ పదేళ్లలో పాలనలో సమస్యలు తీవ్రతరం : దండి**

కేంద్ర ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ, కార్మికు హక్కుల హరింపు, విద్య, వైద్య రంగాల నిర్లక్ష్యం, మహిళలు, దళితులు, ఆదివాసీలపై వివక్ష వంటి సమస్యలు తీవ్రతరమయ్యాయని



సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబరు 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే "ఛలో ఢిల్లీ" మహాధ్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే పాదయాత్రలు, సెప్టెంబరు 1న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తు పాల్గొని విజయవంతం చేయాలని దండి సురేష్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ప్రచారం అనే అంశాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ భారత జాతీయ ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్‌రెడ్డి కులం, మతం, వర్గ పోరాటం అనే అంశాన్ని సింగు నరసింహారావు ప్రపంచీకరణ, దాని ప్రభావం అనే అంశాన్ని ఏనుగు వెంకటేశ్వరరావు బోధించారు. ఈ శిక్షణ తరగతులలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్‌రావు, ఎంఏ రహీం, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, పలువురు సర్పంచ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఖరి బిల్లు అందేదెన్నడో..?

(మొదటిపేజీ తరువాయి) అడుగుపెట్టినవారికి కూడా సంతోషం లేదు. కారణం, ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 1 లక్ష ఆఖరి విడత బిల్లు రాకపోవడం. ఇల్లు కట్టుకుంటే రూ. 5 లక్షలు వస్తాయని ఆశపడి, చేతిలో పైసలు లేకపోయినా చాలా మంది అప్పులు తెచ్చి మరీ ఇల్లు పూర్తి చేశారు. తీరా గృహప్రవేశం అయిపోయాక ఫైనల్ బిల్లు కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది.

**అంతా బాగున్నా... ఆఖరులోనే..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తుంది. లబ్ధిదారులు ఇంకాస్త మెరుగ్గా నిర్మించుకు నేలా కొద్దో గొప్పో అప్పు చేస్తున్నారు. మార్కింగ్, పునాదులు, గోడలు, స్లాబ్ దశల్లో ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో సరి గ్గానే నగదు జమవుతుంది. కానీ చివరి బిల్లు మాత్రం అందలేదు. అసలే అప్పుచేసి ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు చివరి బిల్లు లక్ష రూపాయలు ఆగిపోవడంతో ఏంచేయాలో పోలుపోనీ స్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. చిన్నపాటి పనులు చేపట్టి ఇల్లు ప్రారంభించుకో వాలనుకున్న వారికి కాలయాపన తప్పడం లేదు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జోరుగా సాగుతోంది. అయితే మొదటి విడతలో ఇల్లు నిర్మించుకున్న వారికి పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో రెండో విడత లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తున్నారు.

# జిల్లాలో హెచ్ఐవి నియంత్రణకు చర్యలు వేగవంతం

**- అదనపు కలెక్టర్ పి శ్రీజ**




ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(నాకో) నిర్దేశించిన 959595 లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా పరిషత్ సీఈఓ శ్రీమతి దీక్షారైనా సమక్షంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ, జిల్లా సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో కేసీ పుల్లయ్య ఫౌండేషన్, జనవాణి, వైఆర్‌జి లింక్ వర్కర్స్ స్కీమ్, సంపూర్ణ సురక్షా కేంద్రం, ఆశా పాజిటివ్ పీపుల్ అసోసియేషన్ తదితర స్వచ్ఛంద సురక్షా కేంద్రం, ఆశా పాజిటివ్ పీపుల్ అసోసియేషన్ తదితర స్వచ్ఛంద సంస్థల పనితీరును సమీక్షించారు. హెచ్ఐవి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ ఐసీటీసీ సేవలను వినియోగించి హెచ్ఐవి స్క్రీనింగ్ శిబిరాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రస్తుతం తొలి 95 లక్ష్యంతో 93 శాతం పురోగతి సాధించిందని, మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో 200 మందికి పైగా హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తులను గుర్తించి, పరీక్షలు నిర్వహించి, యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టి) సేవలకు అనుసంధానం చేయాల్సి ఉందని సమావేశంలో వెల్లడించారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ఐసీటీసీ, పీపీటీసీటీ, డీఎస్ఆర్‌సీ, డీటీసీ, ఏఆర్టీ కేంద్రాల పనితీరును సమీక్షించిన అధికారులు, హెచ్ఐవి పరీక్షలు, కౌన్సిలింగ్, చికిత్స, ఫాలోఅప్ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఆర్టీ కేంద్రాల్లో నమోదైన ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా చూడడంతో పాటు, అర్హులైన వారందరికీ వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించి వైరల్ లోడ్ అణచివేత సాధించాలని సూచించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం కింద మిగిలి ఉన్న తొలి 95 లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్జీవోల పనితీరును నిరంతరం సమీక్షించాలని, భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎల్ ప్రవీణను ఆదేశించారు. సమావేశంలో ఏఆర్టీ నోడల్ అధికారి డాక్టర్ సురేందర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి కిరణ్‌కుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్‌రావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ నివేదిత, జిల్లా సహాయోగి శ్రీశంకర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐసీటీసీ, పీపీటీసీటీ, డిఎస్‌ఆర్‌సీ, డీటీసీ, ఏఆర్టీ, డీపీసీయూ సిబ్బంది, జిల్లా మాస్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది అబ్దుల్ రజాక్‌కు ఘన నివాళి



ప్రజాపక్షం/మంచుపల్లి: ప్రముఖ సీనియర్ న్యాయవాది, మాజీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, అంబేద్కర్ వాది ఎం.అబ్దుల్ రజాక్ (65) అకాల మరణం పట్ల న్యాయవాదుల సంఘం, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చుంచుపల్లి హౌసింగ్ బోర్డులోని ఆయన స్వగృహంలో గురువారం మాజీ న్యాయవాది మెండు రాజమల్లు, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్ తదితరులు రజాక్ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చడంతోపాటు రెండు నిమిషాలు మౌనం పాటించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజాక్ సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీకి లీగల్ అడ్వైజర్‌గా, ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన జీవితం యువతతోపాటు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. రజాక్ సతీమణి గత ఏడాది మరణించగా, ప్రస్తుతం న్యాయ విద్యను అభ్యసిస్తున్న కుమారుడు ఉన్నారని తెలిపారు. నివాళి కార్యక్రమంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర కార్యదర్శి జనపరెడ్డి గోపీకృష్ణ, బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కాసాని రమేష్, నయీమ్ ఖురేషి, సాయికృష్ణ, సబ్బారాపు మధుసూదన్ చిన్ని, సోమరాజ్, గుండా రమేష్, పి.సురేందర్, సల్మాన్ ఖాన్ తోతా, అల్లి శంకర్, సినీ నటుడు తాండూర్ ధనరాజ్, అన్వర్ భాయ్, బిక్కులాల్, పాషా భాయ్, అడ్వకేట్ ఎర్ర శ్రీనివాస్, కారం రమేష్, రాజేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సదుపాయాలతో

# యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం



**-స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెల లోపు పూర్తి చేయాలి**
**-స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని రఘునాథపాలెంలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, వైఎస్ఆర్ నగర్ ప్రధాన రహదారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం కలెక్టర్ దివాకర టిఎస్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాకులు, డార్మిటరీ భవనం, వంట గది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కలెక్టర్ కాలినడకన పరిశీలిస్తూ పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున ఐదు యంగ్ ఇండియా స్కూళ్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం ప నులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలో రాణించేలా అత్యాధునీక మౌలిక వసతులతో ఈ విద్యా సంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలోనే లింకు రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను అభివృద్ధి పర్చాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలన్నారు. నెల రోజుల లోపు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య

**-ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం**
**-సిపిఐ నగర కార్యదర్శి జానిమియా**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ పార్టీ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య అని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాటు చేసిన పార్టీ గద్దెను బుధవారం అర్ధ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐటియుసి ఆటో స్టాండ్ ఉపాధ్యక్షులు షేక్ అక్రమ్, ఖానాపురం హవేలీ సహాయ కార్యదర్శి ఆముదాల వెంకన్న తదితరులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర కార్యదర్శి జానిమియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా దెబ్బతీసేవిధంగా సిపిఐ పార్టీ గద్దెను అర్ధరాత్రి వేళ అక్రమంగా కూల్చివేయడం అత్యంత ఖండనీయమన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను కోరారు. ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించే చర్యలకు ఎవరు పాల్పడవద్దని శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కూల్చివేసిన చోటే సిపిఐ పార్టీ గద్దెను తిరిగి ఏర్పాటు చేయాలని జానిమియా డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అహంకార గద్దె కూలడం ఖాయం

**-మాజీ మంత్రి పువ్వాడకు వస్తున్న ఆదరణను తట్టుకోలేకే కుట్రలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ జెండా గద్దెల జోలికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఆ అహంకార గద్దె కూలడం ఖాయమని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతో బిఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేసిన ప్రాంతాన్ని గురువారం బిఆర్ఎస్ నేతలు పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి తుమ్మల అనుయయులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసే చర్యలకు ఊసిగొల్పుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ జెండా గద్దెలను కూల్చివేయాలంటూ చేసిన వ్యాఖ్యలను మంత్రి తుమ్మల అనుసరిస్తూ బిఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేశారన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఖమ్మంలో కూల్చివేతలే మంత్రి తుమ్మల ఎజెండాగా పెట్టుకున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై కాకుండా ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దేవభక్తిని కిషోర్ బాబు, గొల్లపూడి రాంప్రసాద్, సురేష్‌నాయక్, వీరేందర్ గౌడ్, షకీనా, మాటేటి కిరణ్, భూక్యా అశోక్, మధు, సతీష్, రమేష్, కొమరయ్య, మల్లేష్, వెంకన్న, గాంధీ, నరేష్, ఉపేందర్, వెంకట్, రాజ్యలక్ష్మి, ప్రవీణ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు కోల్పోతున్న పట్టాదారులకు న్యాయం చేయాలి

**-బాధితులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌కు వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం సర్వే నెం. 218లో ఇండ్ల స్థలాల పట్టాలు పొందిన వారికి న్యాయం చేయాలని బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బాధితులతో కలిసి పగడాల నాగరాజు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఖమ్మం పట్టణంలో మూడువేల మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కేసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రఘునాథపాలెం సర్వే నెం. 2018లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారన్నారు. అమరావతి నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పేరుతో ఇండ్ల స్థలాలను తీసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 300 మంది పట్టాదారులు ఇండ్ల నిర్మాణంపై ఆందోళనకు గురవుతున్నారన్నారు. అభివృద్ధి పనులకు బిఆర్ఎస్ వ్యతిరేకం కాదని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బాధితులకు నష్టం కలిగించడం అన్యాయమన్నారు. ఇండ్ల స్థలాలు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంబంధిత అధికారులతో సమీక్షించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ, పొదిల నాగరాజు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పోస్టుల అక్రమాలపై విచారణ జరిపించాలి

**-కలెక్టర్‌కు మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్య వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని సత్తుపల్లి మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్‌ను సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రతినిధి బృందం బాధిత అభ్యర్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈ నియామకాల్లో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నియామక ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మొత్తం నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చి న్యాయం చేయాలని కోరారు. అవసరమైతే ఈ అక్రమాలపై హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని బాధితులకు సండ్ర వెంకటవీరయ్య భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, బత్తుల మురళీ, వీరన్న, బిచ్చాల తిరుమలరావు, బాధిత అభ్యర్థులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై పర్యవేక్షణ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని మల్లారం, వల్లభి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియపై ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా విస్తృతంగా పర్యవేక్షించారు. బూత్ నం.47, 48, 49, 50,51,52 పరిధిలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చిరామయ్య, మండల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి భూక్యా ధర్మ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపులేటి దేవేందర్, బీబ్లాక్ అధ్యక్షుడు కందిమల్ల వీరబాబు పర్యవేక్షించారు. ప్రతీ బూత్‌లో ఓటరు ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసేలా బీఎల్‌ఏ, బీఎల్‌ఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ, సహకారాలు అందిస్తూ ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలూరి భాస్కరరావు, సర్పంచి భిక్షాల భిక్షం, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీమసర్తి ఎల్లయ్య, మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడు గూడె సాహెబ్, నాలుగో జోన్ ఇంఛార్జి పిల్లట్ల రాఘవ, మండల సామాజిక మాధ్యమ ఇంఛార్జి సంగీతరావు, బీఎల్‌ఓ, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

## రక్షణ పక్షోత్సవ పోటీల్లో జేవిఆర్ సీహెచ్‌పీకి ప్రథమస్థానం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గత ఏడాది నిర్వహించిన 56వ రక్షణ వార్షిక పక్షోత్సవాల సందర్భంగా సింగరేణి సంస్థ వ్యాప్తంగా నిర్వహించిన భద్రతా పోటీల్లో జేవిఆర్ సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) విభాగం ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయానికి గుర్తింపుగా సోమవారం రామగుండం1 ఏరియాలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో జేవిఆర్ సీహెచ్‌పీ ప్రతినిధులకు ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం జేవిఆర్ సీహెచ్‌పీ ప్రాంగణంలో విజయోత్సవ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖరరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీ (ఈ అండ్‌ఎం) పి. సాయినాథ్, డిప్యూటీ ఎస్‌సీ (ఈఅండ్‌ఎం) బి. రాంబాబు, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆఫీసర్ ఎ. ప్రదీప్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ నాయకులు సముద్రాల సుధాకర్, డి. ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకులు క్రాంతి, ఇ. నగేష్‌తో పాటు పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## సీపీఐ మండల కార్యదర్శి రమేష్ మాతృమూర్తి మృతికి సంతాపం



**ప్రజాపక్షం/గుండాల:** సీపీఐ గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్ మాతృమూర్తి మృతిపై భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలియజేస్తూ, మృతు రాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మృతురాలి అంతిమయాత్రలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో న్యూడెమోక్రసీ నాయకుడు ముక్తి సత్యం, గుండాల సర్పంచ్ కోరం సీతారాములు, కాంగ్రెస్ నాయకులు ఊకె బుచ్చయ్య, ఖదీర్, అజయ్, టీడీపీ నాయకులు తోలెం సాంబయ్య, అప్పారావు, మల్లయ్య, మదన్న, బీఆర్ఎస్ నాయకులు తెల్లం భాస్కర్, గడ్డం వీరన్న, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు షారోజ్, మాస్‌లైన్ నాయకుడు కృష్ణ, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని మృతురాలికి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గుగులోత్ బుజ్జికి ఘన నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని తులిస్య తండాకు చెందిన గుగులోత్ బుజ్జి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన భౌతికకాయానికి గ్రామ పంచాయితీ సర్పంచ్ దండు ప్రవీణ్, వార్డు సభ్యురాలు జర్పుల శాలి, వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ అనుచరుడు ఎస్ఎన్ నాయక్ నివాళులర్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ అంత్యక్రియల నిమిత్తం రూ 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు దశ దిన కార్యక్రమానికి 100కిలోల బియ్యం అందజేస్తామని ఎస్ఎన్ నాయక్ ప్రకటించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, స్థానికులు, గ్రామ ప్రజలు పాల్గొని గుగులోత్ బుజ్జికి ఘనంగా నివాళులర్పించారు.

## గురుకుల తెలుగు ఉపాధ్యాయుడు డా.వెంకన్నకు పీహెచ్‌డీ ప్రదానం



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డా. బాషిపంగు వెంకన్నకు ఉస్మానియ విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. డా దాశరథుల నర్సయ్య పర్యవేక్షణలో తెలంగాణ కథా సాహిత్యం, ప్రాదేశిక వ్యక్తీకరణ అంశంపై పరిశోధన పూర్తి చేశారు. మరిపెడకు చెందిన బాషిపంగు గుర్వయ్య, సుగుణ దంపతుల కుమారుడైన డాక్టర్ వెంకన్న తన విజయానికి ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, పరిశోధన పర్యవేక్షకుడు డాక్టర్ దాశరథుల నర్సయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ పి మల్లయ్య అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి మల్లయ్య, యూహెచ్ ఏటీపీ ప్రేమలత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ వెంకన్నను అభినందిస్తూ ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## అక్రమ కేసులు, అరెస్టులతో బీఆర్ఎస్‌ను అణచలేరు..



**ప్రజాపక్షం/ఇల్లందు:** అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో బీఆర్ఎస్ కార్యకర్తలను అణచివేయడం సాధ్యం కాదని బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు, సోషల్ మీడియా వారియర్ పావని గౌడ్ అన్నారు. తనపై నమోదైన కేసులలో భాగంగా గురువారం ఇల్లందు కోర్టుకు హాజరైన ఆమెకు బీఆర్ఎస్ జిల్లా, నియోజకవర్గ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా పావని గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, రైతు సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై తాము ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తనపై ఇప్పటికే తొమ్మిది కేసులు నమోదు చేసినప్పటికీ, అవసరమైతే 99 కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని అన్నారు. ప్రజల తరఫున సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా నాయకులు కాసాని హరిప్రసాద్ యాదవ్, గిన్నారపు రాజేష నత్తాల హరికృష్ణ, మీర్జా బేగ్, బిపిన్ రాథోడ్, నెమలి నిఖిల్, వార రమేష్, పాషా, గుండమ్మల రామకృష్ణ, ఎల్ రాంబాబు, మాజీ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, మాజీ ప్రధాన కార్యదర్శి కొక్కు సరిత, పట్టణ మహిళా నాయకురాలు పింకీ లోద్, ఎల్ సులోచన, తదితరులు కోర్టు వద్ద పావని గౌడ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

# పీఎంఈజీపీ రుణాల విచారణలోనూ మాయాజాలమా..?

-ఉన్న యూనిట్లకే పరిమితమైన తనిఖీలు..?
-లేని యూనిట్లను కప్పిపుచ్చే ప్రయత్నాలపై ఆరోపణలు
-రాత్రికి రాత్రే గేదెలు, టెంటు సామాన్లు ఏర్పాటు చేశారంటూ గ్రామాల్లో చర్చ
-బ్యాంకు అధికారిపై కొత్త ఆరోపణలు
-స్కూటీ వ్యవహారంపై అనుమానాలు
-ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్








**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి డీసీసీబీ బ్యాంకు ద్వారా మంజూరైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపి) రుణాల అక్రమాలపై ప్రారంభమైన టెస్కాబ్ విచారణ కూడా విమర్శలకు తావిస్తోంది. అక్రమాల అసలు మూలాలను వెలికితీయాల్సిన విచారణ, కేవలం పేరుకే జరుగుతోందని లబ్ధిదారులు, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు పత్రికల్లో వెలువడిన కథనాల నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో విచారణ ప్రారంభమైనప్పటికీ, విచారణ తీరుపై కొత్త సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం బ్యాంకు రికార్డులను పరిశీలించిన టెస్కాబ్ బృందం, గురువారం సదాశివునిపాలెం, నారాయణపురం గ్రామాల్లో యూనిట్లను తనిఖీ చేసింది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూనిట్లను కాకుండా, ఇప్పటికే సక్రమంగా ఉన్న యూనిట్లకే అధికారులు వెళ్లారని స్థానికులు విమర్శిస్తున్నారు. అసలు అక్రమాలు జరిగిన చోట్ల తనిఖీలు జరగకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందని అంటున్నారు. గ్రామాల్లో టెస్కాబ్ బృందం వస్తోందన్న సమాచారం ముందుగానే చేరడంతో, యూనిట్లు లేని కొందరు లబ్ధిదారులు రాత్రికి రాత్రే టెంటు సామాన్లు, గేదెలు తదితరాలను తీసుకొచ్చి ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నారాయణపురంలో ఒక లబ్ధిదారుడు టెంటు సామగ్రిని చివరి నిమిషంలో తెచ్చి యూనిట్ ఉన్నట్లు చూపించాదని గ్రామస్థులు చెబుతున్నారు. సదాశివునిపాలెంలో మరో లబ్ధిదారుడు పొరుగింటి వారైన అంజయ్య, అశోక్‌రెడ్డి ఇళ్ల నుంచి గేదెలను తీసుకొచ్చి డెయిరీ యూనిట్‌గా చూపించినట్లు గ్రామంలో చర్చ సాగుతోంది. ఇదే వ్యవహారం విచారణ బృందం దృష్టికి వెళ్లినా, లోతుగా పరిశీలించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు అదే గ్రామానికి చెందిన ఒక లబ్ధిదారుడు తన పేరుపై బ్యాంకు అధికారికి కొత్త ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఇచ్చాడని, ఆ వాహనం ప్రస్తుతం ఖమ్మంలోని ఆ అధికారి వద్దే ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే రుణాల మంజూరు ప్రక్రియపై తీవ్ర అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొదటి నుంచే సంబంధిత బ్యాంకు అధికారి వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందని, ఇప్పుడు జరుగుతున్న విచారణలో కూడా టెస్కాబ్ బృందాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మీడియా ప్రతినిధులను గమనించిన వెంటనే విచారణ బృందం అక్కడి నుంచి వెళ్లిపోవడం కూడా అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారులు, టెస్కాబ్ సిబ్బందితో కాకుండా జిల్లా స్థాయి స్వతంత్ర ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రతి యూనిట్‌ను క్షేత్రస్థాయిలో సమగ్రంగా తనిఖీ చేయాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు, నిజమైన లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పూర్తి స్థాయి విచారణ జరిగితేనే అసలు అక్రమాలు వెలుగులోకి వచ్చి, అర్హులైన నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# తనిఖీ, సమీక్ష, రక్తదాన శిబిరం

పెనగడప పీహెచ్‌సీలో బిజీగా గడిపిన డీఎంహెచ్ఓ





**ప్రజాపక్షం/చుంచుపల్లి:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి.ఎం హెచ్.ఓ) డాక్టర్ తుకారాం రాథోడ్, డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రతాప్ గురువారం పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీ, వార్డులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన వైద్య సిబ్బంది సమావేశంలో పాల్గొని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ సహకారంతో వాడేపల్లి రమేష్ హైమద్ మరియు పెనగడప యువత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో పెనగడప పిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా॥ హరీష్, వైద్యాధికారి డాక్టర్ హరి, పెనగడప గ్రామ సర్పంచ్ సీతారాములు, శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు ఎన్.సురేష్ రెడ్డి, బ్లడ్ ఫౌండర్స్ ప్రతినిధులు బాలు, కన్న, సెక్రటరీ సురేష్, బీఆర్ఎస్ నాయకులు అనుదీప్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువతతో పాటు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# రోల్డ్ గోల్డ్ మోసాలపై కారేపల్లి పోలీసుల ఉక్కుపాదం

**ప్రజాపక్షం/కారేపల్లి:** రోల్డ్ గోల్డ్‌ను అసలైన బంగారంగా చూపించి బ్యాంకులు, బంగారం దుకాణాల్లో తాకట్టు పెట్టే మోసాలపై కారేపల్లి పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల అందిన ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి సుమారు 20 మంది ఏజెంట్ల ద్వారా యువకులను డబ్బు ఆశ చూపి ఈ మోసాల్లోకి దింపినట్లు సమాచారం. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ఓ బంగారు దుకాణంలో డీసీసీ బ్యాంకు పరిధిలో రోల్డ్ గోల్డ్‌ను తాకట్టు పెట్టి నగదు పొందిన ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై కారేపల్లి సీఐ నునావత్ సాగర్ మాట్లాడుతూ రోల్డ్ గోల్డ్ మోసాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అక్రమాలకు పాల్పడినా, తెలిసీ సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్యాంకులు, బంగారు వ్యాపారులు ప్రతి ఆభరణాన్ని అత్యాధునిక పరికరాలతో పరీక్షించిన తర్వాతే స్వీకరించాలని సూచించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశతో మోసగాళ్ల మాటలు నమ్మవద్దని, అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీఐ విజ్ఞప్తి చేశారు.

# వరి పొలాల్లో కూలీల సందడి..!






మెండుగా జలకళ...

**ప్రజాపక్షం/కరకగూడెం:** ఆకాశం వైపు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన అన్నదాతల నిరీక్షణ ఫలించింది. మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం రికార్డు స్థాయిలో పడటంతో భూమాత తడిసి ముద్దయింది. నీళ్లు లేక వెలవెలబోయిన వాగులు, వంకలు, చెరువులు వరుణుడి కరుణతో ఒక్కసారిగా జలకలను సంతరించుకున్నాయి. ఎండల తీవ్రతకు, వానల అటకాయింపునకు తల్లడిల్లిపోయిన రైతన్నలకు ఈ వర్షం కొండంత ఊరటనిచ్చింది. నారుమళ్లను కాపాడుకునేందుకు కన్నీటి పోరాటం!గత రెండు మూడు నెలలుగా సరిపడా వర్షాలు లేక మండలానికి చెందిన అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. వానకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా చినుకు అనవాళ్లు లేకపోవడంతో వేసిన నారుమళ్లు ఎండుముఖం పట్టాయి. బోరు బావుల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగుంటిపోవడంతో నీళ్లు రాక మోటార్లు తరచూ కాలి పోయి మరమ్మతులకు గురయ్యాయి. వేలకు వేలు ఖర్చు చేసి మోటార్లను బాగు చేయించుకుంటూ, వచ్చీరాని అరకొర నీటితోనే రాత్రింబవళ్లు పచ్చని నారును సాదుకోవడానికి రైతన్నలు కన్నీటి పోరాటం చేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో తమ శ్రమ అంతా బూడిద పాలైపోసిన పన్నీరవుతుందేమోనని దిగులుతో రోజులు వెళ్లదీశారు.

**ఒక్క రాత్రితో మారిన స్వరూపం...**

బుధవారం రాత్రి ఒక్కసారిగా ఆకాశానికి తూట్లు పడినట్లు కురిసిన భారీ వర్షం మండల స్వరూపాన్నే మార్చేసింది. మండలంలోని పెద్ద చెరువుతో పాటు అన్ని గ్రామాల్లోని కట్టలు, ఊర చెరువులు, కుంటలు నిండు కుండల్లా మారాయి. చెరువుల అలుగులు పారుతుండటంతో పల్లెల్లో ఎటు చూసినా నీటి సవ్వడులే కనిపిస్తున్నాయి. ఎండిపోయిన భూములు ఇంకినంత నీటిని పీల్చుకోవడమే కాకుండా, పడిపోయిన భూగర్భ జలాలు మళ్లీ పెరిగేందుకు ఈ వర్షం ఎంతో దోహదపడింది. ముమ్మరంగా వరి నాట్లు...

**పల్లెల్లో హడావుడి..**

వర్షం తగ్గడమే తడవుగా అన్నదాతలు గురువారం హుషారుగా పొలాల్లోకి దిగారు. వానదేవుడు కరుణించడంతో పొలాలను దుక్కి దున్ని, నాట్లు వేసే పనిలో నిమఘ్నమయ్యారు. నాగలి పట్టిన రైతు, నారు మూటలు మోస్తున్న కూలీలు, హుషారుగా జానపద పాటలుపాడుతూ నాట్లు వేస్తున్న మహిళలతో పల్లెల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పల్లె సీమలన్నీ పచ్చని ఆశలతో, సందడి వాతావరణంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని రైతులు సంబరాలు ఎవరికీ చెప్పలేని సంబరాలు అందరికీ అనుకూలంగా వర్షాలు పడటం వల్ల చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లెత్తుతున్నాయి.

# మున్సిపాలిటీలో కాంట్రాక్టుల నిర్లక్ష్యం..!

-పట్టించుకోని సంబంధిత అధికారులు
సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వం మున్సిపాలిటీలో అభివృద్ధి కొరకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ కొంత నిధులు కేటాయించి సైడ్ కాలువలు డ్రైనేజీ, కల్వర్టులు బ్రిడ్జి ల నిర్మాణం చేపట్టి పనులు చేపిస్తా ఉంటే దానికి సంబంధించినటువంటి ఆ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తా ఉందని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. దీనికి ఉదాహరణ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ ఏరియాలో చర్చి బజార్లో ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడల్లా కాలువ పొంగి బ్రిడ్జి మీద నుంచి నీరు ఇళ్లలోకి చేరుతుందని, ఈ ఇబ్బందిని గమనించిన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దీనిని ఎత్తు పెంచాలని ప్రజల విజ్ఞప్తి మేరకు కొన్ని నిధులు కేటాయించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. బ్రిడ్జి పనులు పూర్తయి చాలా రోజులు కావస్తున్న బ్రిడ్జి అటు సైడ్ ఇటు సైడ్ మట్టి పోయాల్సి ఉండగా చెరువు మట్టి పోసి ,కొంత పక్కనే ఉన్న కాలువలో ఉన్న మట్టిని తీసి అక్కడ వేయడంతో వర్షం కురవడంతో నీరు నిలిచి పోయింది. కనీసం మనసులు కాలి బాటన కూడా నడిచే పరిస్థితి కూడా లేకుండా తయారైందని, నీరు అక్కడ పేరుకపోయి ఉండడంతో బురదమయంగా మారింది. సదరు కాంట్రాక్టు కనీస మా నీటిని ఎలా బయటికి పంపించాలి అనే ఆలోచన కూడా లేకుండా వదిలేసి వెళ్లిపోయారు. ఆ ప్రాంత ప్రజలు కాలిబాటను కూడా లేకుండా ఇబ్బంది గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఏ ఈ దీనిని కలగజేసుకుని నీరు బయటకు పోయే విధంగా ఏర్పాటు చేయాలని, కాలిబాటన పోయే పాదాచార్లకు ఇబ్బంది లేకుండా చూడాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కన్నెబోయిన ప్రసాద్.,ఆదరణ రాములు, నారాయణ, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సమాజంలో సమానత్వం, సామరస్యం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాలపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సోంపల్లి గ్రామ పంచాయితీలో సర్పంచ్ తాటి లక్ష్మి ఆధ్వర్యంలో పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే అత్యాచారాలు, వేధింపులు, కులవివక్ష వంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎవరైనా వివక్షకు గురైతే భయపడకుండా సంబంధిత అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టాలు కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకొని వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలంటే పరస్పర గౌరవం, సమానత్వ భావన అవసరమన్నారు. కుల, మత, వర్గ వివక్షలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని తెలిపారు. సదస్సులో ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక) చట్టం, పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రభుత్వ పరిరక్షణ చర్యలు, సంక్షేమ పథకాలు, వివక్షకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా ప్రతి పౌరుడు గుర్తుంచుకుని సామాజిక సామరస్యాన్ని కాపాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు ఎస్సీ బాలుర హాస్టల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, ఎస్సీ బాలికల హాస్టల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సునీత, పంచాయితీ కార్యదర్శి భూక్య వెంకటేష్, గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి చెత్త సేకరణకు సహకరించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మల్లెలమడుగు గ్రామ పంచాయితీ పరిధిలోని 1వ, 2వ వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని సర్పంచ్ మచ్చా నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్తతో పాటు ప్రత్యేక వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేసి పంచాయితీ ట్రాక్టర్‌కు అందించాలని గ్రామ ప్రజలకు సూచించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ వర్గీకరించి సేంద్రియ ఎరువు తయారీతో పాటు పునర్వినియోగానికి అనువైన వస్తువుల విక్రయానికి చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామ ప్రజలు రహదారులపై చెత్త వేయకుండా, ఇంటి వద్దకు వచ్చే పంచాయితీ ట్రాక్టర్‌కే చెత్తను అందించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో 1వ వార్డు సభ్యుడు కొమరం శ్రీను, 2వ వార్డు సభ్యుడు రండి రాములు, పంచాయితీ కార్యదర్శి జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఈనపల్లి పవన్ సాయి డిమాండ్ చేశారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని హాస్టళ్లను వైద్యాధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేసి, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టళ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, ఆహార నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి, లోపాలను వెంటనే సరిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థికి సకాలంలో వైద్య సేవలు అందేలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం గ్రామ పంచాయితీలో సర్పంచ్ పెద్దిం చిన్నక్క అధ్యక్షతన, పోలీసులు శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు, ఈసందర్భంగా ఎస్ఐ జగన్ మోహన్ చారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే వివక్ష, వేధింపులు, అత్యాచారాలకు సంబంధించి అమల్లో ఉన్న చట్టాలు, శిక్షలు, బాధితులకు కల్పించే రక్షణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చట్టాలను గౌరవిస్తూ సామాజిక సామరస్యాన్ని కాపాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరెడ్డి సతీష్, పంచాయితీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు శ్రీనుబాబు, వేణు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు ఘన వీడ్కోలు

-32ఏళ్ల సేవలను కొనియాడిన ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** కొత్త మారేడుబాక అంగన్‌వాడీ టీచర్ కిలిమి చెల్లాయిపాప పదవీ విరమణ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్లగూడెం సెక్టార్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ దుమ్ముగూడెం మండల కార్యదర్శి బొల్లోజు వేణు మాట్లాడుతూ 32ఏళ్ల పాటు అంకితభావంతో అంగన్‌వాడీ సేవలు అందించిన కిలిమి చెల్లాయిపాప సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నోముల రామిరెడ్డి, నర్సాపురం సర్పంచ్ కుంజ కనకరత్నం, భద్రాచలం ఏఐటీయూసీ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాసరావు, సూపర్వైజర్లు కే ధనలక్ష్మి , డి రాజేశ్వరి, ఎన్జీవో పి రత్నకుమార్, ఏఐటీయూసీ దుమ్ముగూడెం అధ్యక్షురాలు కె విజయలక్ష్మి, పి లక్ష్మి, ఎస్ లక్ష్మి దేవి, డి వెంకటరత్నం, జి లలితకుమార్, ఆర్లగూడెం సెక్టార్ నాయకురాలు కే ప్రభావతి, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొని కిలిమి చెల్లాయిపాపను ఘనంగా సన్మానించారు.

## మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**ప్రజాపక్షం/ఇల్లందు:** గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు అన్నారు. విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయితీలో ఆయన అధ్యక్షతన మహిళా గ్రామసభ నిర్వహించారు. సభలో మహిళలు గ్రామ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 55ఏళ్లు పైబడిన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చడంతో పాటు, 14ఏళ్లు పైబడిన బాలికలకు స్నేహ గ్రూపులు ఏర్పాటు చేయాలని వీవోలకు సూచించారు. త్వరలో పీవో భవన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సందీప్, ఉప సర్పంచ్ గూడెల్లి రేణుక, వార్డు సభ్యులు మల్లిక, కళావతి, వసంత, హరిసింగ్, సదా, వీవోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

**-ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి**

**-వైఎస్ఆర్ కాలనీలో పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల వయస్సు గల ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టిసారించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి నాణ్యమైన బోధన అందించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం విద్యాభ్యాసానికి ఎంతో అవసరం అన్నారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని, రాగిజావను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయం అందరికీ చేరువ చేయడమే లక్ష్యం

**-జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని ప్రతి అర్హుడికి రాజ్యాంగ బద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస జిల్లా కారాగారాన్ని సందర్శించారు. జైలు పరిసరాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందెందుకు అర్హులైన పేద అండర్ ట్రయల్ ఖైదీలు తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించాలని ఆమె సూచించారు. ప్రతి అర్హుడికి రాజ్యాంగ బద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందె హక్కు ఉందన్నారు. న్యాయవాది నియామకం,




న్యాయ సలహా తదితర సేవలను డిఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందించబడతాయన్నారు. ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కారాగార సూపరింటెండెంట్ శ్రీధర్, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా సాగునీటి విడుదలకు షెడ్యూలు ప్రకటించాలి : సిపిఐ

**-అయోమయంలో ఆయకట్టు రైతులు**

**-సాగునీటి ప్రణాళిక వెల్లడించాలని ఇరిగేషన్ అధికారులకు వినతి**



**ప్రజాపక్షం/వైరా :** వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులు పంటల సాగుపై స్పష్టమైన నిర్ణయం తీసుకునేందుకు సాగునీటి విడుదలకు సంబంధించి అధికారులు ముందస్తు షెడ్యూలు ప్రకటించాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబాబు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ వైరా మండల సమితి ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబాబు మట్లాడుతూ వైరా ఆయకట్టు పరిధిలో రైతులు ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలతో నార్లు పోసి నాట్లకు సిద్ధమవుతున్నారని తెలిపారు. అయితే వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాది కొనసాగవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్న నేపధ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. గోదావరి జలాలతో వైరా చెరువు నిండినప్పటికీ సాగునీటి విడుదలపై స్పష్టత లేకపోవడంతో రైతులు వరి సాగు చేయాలా?వద్దా? అనే సందిగ్దంలో ఉన్నారని పేర్కొన్నారు. నాట్లు వేసిన తర్వాత నీరు అందకపోతే పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ప్రభుత్వం ఇరిగేసన్ అధికారులు సాగునీటి విడుదల తేదీలు, నీటి సరఫరా విధానం ఆయకట్టుకు అందించే నీటి పరిమాణంపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఒకవేళ నీటి కొరత పరిస్థితులు ఉంటే రైతులు ఏ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే నష్టపోకుండా ఉంటారో వ్యవసాయశాఖ సూచనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రైతు సంఘం మండల నాయకులు కొండా రామకృష్ణ, సిపిఐ నాయకులు మోట కొండ, గారపాటి అశోక్, తగరం గురుమూర్తి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలను కూడా పార్టీ ఖాతాలో వేసుకుంటున్న కాంగ్రెస్

**ప్రజాపక్షం/మధిర:** మధిరలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకం ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారం చూస్తుంటే అది అయిపోయిన పెళ్లికి బాజంత్రీలు వాయిస్తున్నట్లుగా అనిపిస్తుందని మధిర మండల బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత అల్పాహారం అందించే ఆలోచన చేసి ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన తర్వాత అదే పథకాన్ని ప్రారంభించి కొత్తగా తామే తీసుకొచ్చిన కార్యక్రమంలా ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంగా కనిపిస్తుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇటీవలే ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రచారం చేశారు. మరి కొద్ది రోజులకే మళ్లీ అదే కార్యక్రమానికి ప్రారంభోత్సవం పేరుతో మరోసారి ప్రచారం చేయడం ఎందుకు? ఒకే కార్యక్రమాన్ని ఎన్నిసార్లు ప్రారంభిస్తారు? ప్రజలను అయోమయానికి గురి చేయడానికేనా ఈ హడావిడి? అంతేకాకుండా ఈ కార్యక్రమం నిర్వహణలో హరే కృష్ణ చారిటబుల్ కమ్యూనిటీ కిచెన్ కీలకపాత్ర పోషిస్తుంది. అలాగే అరవిందో డివిస్ ఫార్మా వంటి సంస్థలు తమ కార్పోరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకారం అందిస్తున్నాయి. వారి సహకారంతో అమలవుతున్న కార్యక్రమాన్ని పూర్తిగా



కాంగ్రెస్ పార్టీ ఘనతగా చూపించడం సరికాదు. సేవ చేసిన సంస్థలకు తగిన గుర్తింపు ఇవ్వకుండా పార్టీ ప్రచారంగా మార్చడం ప్రజలను తప్పుదోవ పటిచడమే . ఇది ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే అధికారిక కార్యక్రమం. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై పార్టీ కార్యక్రమంలా ప్రచారం చేయడం ఎందుకు? ఇది ప్రభుత్వ కార్యక్రమమా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా? మున్సిపాలిటీ పరిధిలో జరిగే కార్యక్రమంలో కనీసం మున్సిపల్ చైర్మన్‌కు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఏ ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వై.వి.అప్పారావు, కనుమూరి వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, పరిసా శ్రీనివాసరావు, ప్యారీ, దిల్, ఇక్బాల్, సైద్, ఆళ్ల నాగబాబు, వేల్పుల శివ, చిదిరాల రాంబాబు, సీతయ్య పాల్గొన్నారు.

# నాల్సా పథకాల ప్రయోజనాలు అందించాలి

**-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దేవి మానస**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన లబ్ధిదారులకు నాల్సా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ (డిఎల్ఎస్ఎ) కార్యదర్శి పి. దేవి మానస మదర్ థెరిస్సా నిరాశ్రయుల ఆశ్రయ గృహాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయితులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి ఆశ్రయితులకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) ఆధ్వర్యంలో అమలులో ఉన్న వివిధ పథకాలు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు నాల్సా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆశ్రయ గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన సర్పంచ్‌ను అవమానించారంటూ నిరసన

**- ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమానికి సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం గ్రామం పంచాయతీ పరిధిలో ప్రభుత్వం తరుపున మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీ చర్చకు దారితీసింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్వహించడాన్ని నిరసిస్తూ గురువారం సిపిఐ(ఎం) గ్రామశాఖ,గిరిజన సంఘం ఖమ్మంరూరల్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నేలపై కుర్చొని నిరసన చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి నిరసన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలోత్ హరి, రెండోవార్డు సభ్యుడు పొన్నం మురళి, ఐదోవార్డు సభ్యుడు ధర్మపురి నాగబ్రహ్మాచారి, పార్టీ నాయకులు ఏలూరి నాగేశ్వరరావు, మేడెబోయిన రామనాథం, అద్దంకి ఉపేందర్‌రావు, జిల్లెల్ల వెంకటేశ్వర్లు, షేక్ నవాబ్‌సాహెబ్, బెదడంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**-21 అంశాలకు ఆమోదం** **-నలుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ రిహానా బేగం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొత్తం 21 అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కోఆప్షన్ సభ్యుల ఎన్నికను నిర్వహించారు. డా. కందిమళ్ల కృష్ణారావు, వేములపల్లి పుష్పలత తో పాటు అల్పసంఖ్యాక వర్గానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ అలీ, బేతంపూడి దేవమణిలను కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహా, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ సురేష్, టీపీఓ కె. రాజు, టీపీఎస్ ఐ. భాస్కర్, టీపీబీఓ కిరణ్, ఆర్ఐ కె. దిలీప్ కుమార్, సీనియర్ అకౌంటెంట్ వై. సుజాత, జూనియర్ అకౌంటెంట్ షేక్ జరీనా, మెప్మా సీఓ ఆర్.వి. ప్రసాద్‌తో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైరాలో బానోతు మనీషా లక్ష్మి పర్యటన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8,3 వార్డుల్లో స్వర్గీయ బానోతు మదన్‌లాల్ కుమార్తె బిఆర్ఎస్ నాయకురాలు బానోతు మనీషాలక్ష్మి గురువారం పర్యటించారు. ముందుగా 8వ వార్డులో జరిగిన శుభకార్యానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 3వ వార్డులో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు వనమా విశ్వేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిలకా కోటయ్య, కొత్తా వెంకటేశ్వరరావు, వేల్పుల నారాయణ, గద్వాల్ రవీందర్, అప్పం సురేష్, కారుకొండ బోస్, దానయ్య, మదుపల్లి కృష్ణ, అయినాల కనకరత్నం, వల్లెపు రాము, మాచర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నషాముక్త్ పోటీల్లో ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు నషా ముక్త్ యువ పోటీల్లో చక్కని ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి అర్హతను సాధించారు. దీనిని ఖమ్మం జిల్లా కేంద్రంలోని స్వర్ణభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు గురువారం కళాశాలలో చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపల్ గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణతో ఫ్యాకల్టీ విద్యార్థులను అభినందించారు.

# పేదోడు ఆశలు నెరవేరుస్తున్నాం : పొంగులేటి






**ప్రజాపక్షం/కల్లూరు:** పేదోడు ఆశలు నెరవేరుస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కల్లూరు లోని డివిన్స్ ఫంక్షన్ హాల్ లో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాలు, భూ సమస్య, ఆసరా సమస్యలు,పేదోడు సమస్యలని ప్రజల కోరిక మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలను విడతలవారీగా రాబోయే రెండున్నర సంవత్సరాలలో అందిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వం ముందుచూపుతో ముందుకెళ్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ క్రమేపి నెరవేరుస్తున్నామని ద్వాక్రా మహిళలు, రైతులు లక్షాధికారులు, కావాలని లక్ష్యంతో అనేక పథకాలను వారికి అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో పరిపాలించిన ప్రభుత్వం ఎనిమిది వేల కోట్ల పైగా అప్పుల భారాన్ని పెట్టి ఫామ్ హౌస్ లో కూర్చున్నారని సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైం దని పేర్కొన్నారు. కల్లూరు మండలంలో లక్ష్మీ పురం, హనుమాన్ తండా, లక్ష్మ తండ, తదితర గ్రామాలలో కస్టోడియన్ భూములతో ఆధారాలు లేక గిరిజనులు ఇతరులు కొన్ని సంవత్సరాలుగా ఇబ్బం దులు పడుతున్నారని సమస్యను సర్వే చేసి త్వరలో పరిష్కరిస్తామని భూ సమస్య ఉన్న మాట వాస్తవమేనని ఈ విషయమై అధికారులు త్వరలో పరిష్కరిస్తారని వెంటనే కలెక్టర్‌ను ఆదేశించారు. శాశ్వత భూ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అదే విధంగా ధరణి చట్టంలో లొసుగులతో గతంలో ఉన్న పాలకులు ఒక కంపెనీకి ఇచ్చి దోచుకొని దాచుకున్నారని అట్టి దానిపై విచారణ చేపిస్తామని వివరిం చారు. ప్రజలు నచ్చి మెచ్చే ప్రభుత్వంగా ఉండి ప్రజల మన్ననలను పొందుతున్నామని పేర్కొన్నారు .ప్రతి మహిళకు అర్హులైన వారికి ఇల్లు ఆసరా పించను స్వయం సహాయక రుణాలు అర్హులైన వారికి అన్ని సంక్షేమ పథకాలతో పేదవాడి ఆశల్ని గౌరవిస్తూ నెరవేరుస్తున్నామని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లూరు మున్సిపా లిటీ అభివృద్ధికి 25 కోట్లు అవసరం ఉందని మున్సిపాలిటీ కార్మికుల వేతనాలు కొన్ని నెలలుగా పెండింగ్ ఉన్నాయని నిధులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. భూ భారతి సమస్య లను ఏడాదిన్నరలో సర్వేలు నిర్వహించి సమస్యలను పరిష్కారం అవు తాయని కల్లూరు లో మంత్రి సహకారంతో మున్సిపాలిటీలో 15 కోట్లతో మౌలిక వసతులు ఎనిమిది కోట్లతో రింగ్ రోడ్డు విస్తరణ పనులు, లోకవరం టు పెనుబల్లి డబల్ రోడ్డు పనులు నియోజకవర్గంలో ప్రస్తుతం 300 కోట్లతో అభివృద్ధి జరిగిందని త్వరలో సత్తుపల్లిలో జి ప్లస్ గృహ సముదాయాలు రెండున్నర సంవత్సరాలలో పూర్తి చేసి ప్రజలకు అందించేందుకు మంత్రి సహకారంతో కృషి చేస్తామని రెండున్నర సంవ త్సరాలలో గత ప్రభుత్వంలో ఇండ్లు నిర్మాణానికి అర్హులైన వారికి ఖాళీ పట్టాలు ఇచ్చిన వారందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ శ్రీని వాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్ ,మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, మున్సిపాలిటీ కమిష నర్ జి సాయి కృష్ణారెడ్డి తోపాటు పలు శాఖల అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలను నాలుగు గంటల పాటు ప్రతి దరఖాస్తుదారు నితో సమస్యను వింటూ దరఖాస్తులను స్వీకరించారు. వెంటనే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు దరఖాస్తులను అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు ఆదేశించారు.

# ఉచిత కోచింగ్‌ను బిసి యువత సద్వినియోగం చేసుకోవాలి



**-యుపిఎస్సీ ఉచిత కోచింగ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ప్రతిభావంతులైన బిసి యువ తకు కల్పిస్తున్న యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం కలెక్ట రేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టిజి బిసి స్టడీ సర్కిల్ ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పరిపాలనలో ప్రతిభా వంతులైన యువత భాగస్వా మ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యుపిఎస్సీ సివిల్ సర్వీ సెస్ కోచింగ్‌ను అందిస్తుందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 2026 ఆగస్టు 24 నుంచి 2027 మే నెల వరకు పూర్తి ఉచిత కోర్సును అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అను భవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌక ర్యాలు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్, పుస్తకాల గ్రాంట్‌ను కూడా అందజేస్తామన్నారు. ఈ కోచిం గ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వ విద్యా లయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బిసి, ఎస్సి, ఎస్టి వర్గానికి చెందిన వారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు ఏడు వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టి ఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు టిజి బిసిస్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బిసి స్టడీ సర్కిల్ శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్‌లోకి నిస్సాన్ టెక్ టోన్ వాహనం విడుదల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజం నిస్సాన్ కంపెనీ నూతనంగా రూపొందించిన టెక్ టోన్ కారును ఖమ్మం మార్కె ట్‌లోకి విడుదల చేశారు. అథరైజ్డ్ డీలరైన వివిసి ఆటో మొబైల్స్‌లో గురు వారం జరిగిన కార్యక్రమంలో నిస్సాన్ టెక్ టోన్ కారును ఖమ్మం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి. రాంబాబు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంవివో రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పక సీటు బెల్ట్ ధరించాలని, ఇన్సూ రెన్స్ లేకుండా వాహనం నడపవద్దన్నారు. వాహనానికి ఇచ్చిన గరిష్ఠ వేగం దాటకుండా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ తెలుసు కుని పాటించాలన్నారు. వివిసి గ్రూప్ చైర్మన్, ఎండి వంకాయలపాటి వెంకట రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నిస్సాన్ కంపెనీ వినియోగదా రుల అభిరుచికి అనుగుణంగా టెక్ టోన్ కారును నూతనంగా రూపొం దించిందన్నారు. ఈ కారు టర్బో 1.0, 1.3 లీటర్ల పెట్రోల్ ఇంజన్‌తో, 100 హెచ్‌పి, 163 హెచ్‌పి పవర్‌తో రెండు వేరియంట్లతో పాటు డిసిటి ట్రాన్స్ మిషన్ సౌకర్యం కలదన్నారు. పనో రమిక్ సన్ రూఫ్ ఉండటం వల్ల కారు లోపల విశాలమైన అనుభూతి ఇస్తుందని తెలిపారు. ఆరు




ఎయిర్ బ్యాగులు, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, అటానమస్, ఎమ ర్జెన్సీ బ్రేకింగ్ వంటి అడ్వాన్స్డ్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయన్నారు. భద్రత రేటింగ్‌లో ఈ కారు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిందన్నారు. క్రూస్ కంట్రోల్ సిస్టంతో పాటు 700 లీటర్ల అతిపెద్ద బూట్ స్పేస్ కలిగి ఉంద న్నారు. ఎక్స్ షోరూం ధర రూ. 10.49 లక్షల నుండి ప్రారంభమవు తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం జనరల్ మేనే జర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం వీడాలి

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వర్షాకాలం నేపథ్యంలో ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం తెలిపారు. నగరంలో పలు చోట్ల చెత్త పేరుకుపో వడం, మురుగు కాలువలు పూడుకుపోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సదుపా యాలు కల్పించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. వర్షాకాలంలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిప దికన పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నిల్వ నీరు ఉన్న ప్రాంతాలలో దోమల నివా రణకు ఫాగింగ్, యాంటీ లార్వా మందులు పిచికారి క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పారి శుధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

**-ఎన్‌సిడిసి కన్సల్టెంట్ డాక్టర్ సామ్‌జాన్ ప్రశంస**




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు ఆదర్శవంతంగా ఉందని కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రో ల్(ఎన్‌సిడిసి) కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ ప్రశంసించారు. గురువారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో అమలవుతున్న 10 రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. అనంతరం ఖమ్మం ప్రధాన ఆసుపత్రి(జిజిహెచ్), జిల్లా పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీ(ఐడీఎస్‌పీ ల్యాబ్), మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ల్యాబ్ పరీక్షలు, రికార్డులు, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవల అమలును పరిశీలించారు. జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సమర్థ వంతంగా అమలవుతున్నాయని, ముఖ్యంగా వ్యాక్సిన్ల ద్వారా నివారించదగిన వ్యాధుల నియంత్రణ(విపిడీ) కార్యక్రమం అమలు తీరు ప్రశంసనీయమని డాక్టర్ సామ్‌జాన్ పేర్కొ న్నారు. కార్యక్రమాల కీలక సూచికలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని అధికా రులకు సూచించారు. ఈ సమావేశంలో ఐడీఎస్‌పి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐ మోథ్యా, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి, ఇన్‌చార్జి ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ ఇ సాయికుమార్, జిల్లా డేటా మేనేజర్ కె కృష్ణమోహన్, ఎంపీహెచ్ఎస్(ఎం) ఎ సతీష్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఆర్ కానిస్టేబుల్ సస్పెండ్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పేకాట ఆడుతూ పట్టుబడిన ఏఆర్ కానిస్టేబుల్‌ను సస్పెండుచేస్తూ పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 19వ తేదీన వేంసూరు మండలం అమ్మపాలెం గ్రామ శివారులోని కంచర్ల వెంకటేశ్వర రావు అలియాస్ జయం, శ్రీహరి అనే వ్యక్తులు ఒక స్థావరాన్ని ఏర్పాటు చేసి పేకాట నిర్వహి స్తున్నారు. విషయం తెలుసుకున్న వెంసూరు ఎస్సై కవిత తన సిబ్బందితో స్థావరంపై దాడులు చేసి 22 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో సత్తుపల్లి టౌ న్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ మహ్మద్ ఇమ్రాన్‌షరీఫ్ ఉన్నాడు. దీంతో విధినిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు శాఖపరమైన నియమాలను ఉల్లంఘించి నందుకు పోలీసు కమిషనర్ అతడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ముదిగొండ సెంటర్‌లో రెండు వర్గాల ఘర్షణ

**- తొమ్మిది మందిపై కేసు నమోదు**

**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ కేంద్రంలో ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించిన తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో కొందరు వ్యక్తులు రెండు వర్గాలుగా ఏర్పడి పెద్దగా కేకలు వేస్తూ పరస్పరం గొడవపడినట్లు గుర్తించారు. ఈ ఘటనతో ప్రజలకు అసౌకర్యం కలగడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందని తెలిపారు. ఈ ఘటనపై ముదిగొండ పోలీసు ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు కందుకూరి రాకేశ్, బంక సాయి, కటారి విక్రమ్, ఉసికల నరేశ్, బొడ్డు మహేశ్, బొడ్డు నాగరాజు, గంట నాగేశ్, చింతలచెరువు ప్రశాంత్, ఆలకుంట చరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఇసుక లారీలతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరుఏటూరు నాగారం ప్రధాన రహదారిపై మణుగూరు మండలం చిక్కుడు గుంట నుంచి సాంబాయిగూడెం వరకు ఇసుక లారీలు ఇష్టారాజ్యంగా రహ దారిపై పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి ఇరువైపులా లారీలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తి తరచూ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతు న్నాయి. ఇప్పటికే పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌ను తొలగించి, ట్రాఫిక్ సమ స్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.